అతను దాని తోలు వలిచి తింటూ ఆలోచించాడు కాని ఆ పండు బోధించేది ఏమిటో అతనికి అర్థం కాలేదు. తోలుని పారేసాక అతనికి స్ఫురించింది, గెలలో సుఖంగా వున్న అది గెలని విడిచి బయటకి రాగానే దానికి ఏమైందో.

మర్నాడు వుదయం నిద్ర లేచాక వెనక్కి తిరిగి మళ్ళీ ఆశ్రమానికి చేరుకున్నాడు. గురువు అతన్ని ఎందుకు తిరిగి వచ్చావని అడగలేదు.

## 82. పంజరం

ఓ రోజు ఓ మతాధికారి ప్రవచనం చెప్పడానికి భక్తుల ముందుకి వస్తూ తనతోపాటు ఓ పాత, తుప్పుపట్టిన పంజరాన్ని కూడా తీసుకువచ్చి దాన్ని అందరూ చూసేలా ఓ టేబిల్ మీద ఉంచాడు. దాన్ని చూసిన భక్తులంతా 'దాన్ని ఆయన ఎందుకు తెచ్చాడా?' అని ఒకరి వంక మరొకరు ప్రశ్నార్థకంగా చూసుకోసాగారు.

ఆయన తన ప్రవచనాన్ని మొదలు పెట్టాడు.

"నిన్న సాయంత్రం నేను గోదావరి నది ఒడ్డుకి వ్యాహ్యాళికి వెళ్ళినప్పుడు ఓ చిన్న పిల్లవాడు చేతిలో ఈ పంజరంతో కనిపించాడు. దాంట్లో అప్పుడే పట్టిన ఓ చిలుక ఆందోళనగా అరుస్తూ కనిపించింది. వాడిని అడిగాను, ఆ చిలకని ఎందుకు పట్టుకున్నావని.

"ఇంటికి తీసుకెళ్ళి దీంతో నేనూ, నా మిత్రులు కలిసి ఆడుకుంటాము." జవాబు చెప్పాడు వాడు.

"ఎలా ఆడుకుంటారు?" అడిగాను నేను.

"దీని ఈకలని పీకుతాము. ఆఖరి ఈకని ఎవరు పీకితే వారు గెలిచినట్లు." జవాబు చెప్పాడు.

"ఈకలన్నీ పోతే రెక్కలు లేక ఇక అది ఎగరలేదు కదా? అప్పుడెలా?" అడిగాను నేను.

"అప్పుడు దాన్ని మా పెంపుడు పిల్లికి ఆహారంగా వేసేస్తాను. పిల్లి నించి అది తప్పించుకోవాలని పరిగెత్తుతూంటే మా పిల్లి దాన్ని ఎలా పట్టుకుంటుందో చూస్తాం." ఆ పిల్లవాడు చెప్పాడు.

"ఈ చిలుకని, పంజరాన్ని నాకు అమ్ముతావా?" అడిగాను.

"మీరేం చేసుకుంటారు?" ఆశ్చర్యపోయాడు వాడు.

"చెప్పు. ఎంతకి అమ్ముతావు?" అడిగాను.

"వెయ్యి రూపాయలు." నేను కొననునుకుని చాలా ఎక్కువ ధర చెప్పాడు వాడు.

నేను నా జేబులోంచి వెయ్యి రూపాయలు తీసి వాడికి ఇచ్చి, ఈ పంజరాన్ని అందులోని చిలకతో సహా కొన్నాను. ఓ మామిడి తోపులోకి వెళ్ళి దాన్ని అక్కడ విడుదల చేసాను. ఇప్పుడు మీకు కొన్ని ప్రశ్నలు. ఈ పంజరంలో చిలుక ఉన్నప్పుడు దీని విలువ వెయ్యి రూపాయలు. ఇప్పుడు చిలుక లేకపోయినా ఈ పంజరం విలువ తరిగిందా? లేక పెరిగిందా?"

"పెరిగింది." భక్తులు జవాబు చెప్పారు.

ఆ మఠాధికారి దాన్ని కాళ్ళ కింద వేసి తొక్కి అది పనికిరాకుండా చేసి అడిగాడు.

"ఇప్పుడు?"

"ఇంకా పెరిగింది." చెప్పారు భక్తులు.

"మనం చేసే ప్రతీ పనీ ఈ పంజరం లాంటిది. దాన్లో చిలుకని ఉంచితే అది మన విలువని తగ్గించేస్తుంది. చిలుకని విడుదల చేసి, పంజరాన్ని మరెవరూ ఉపయోగించకుండా నాశనం చేస్తే మన విలువ పెరుగుతుంది. ఇదే నేను ఇవాళ మీకు చెప్పాలనుకున్న ప్రవచనం." వివరించాడా మఠాధికారి.

## 83. లోకం చూసేది

పెళ్ళిళ్ళు జరిపించడానికి ఇద్దరు పురోహితులు తరచు కాశీ నించి సమీపంలోని రామ్‌పూర్‌కి వెళ్ళేవారు. వెళ్ళినప్పుడల్లా వాళ్ళు కాశీరాం అనే అతని ఇంట్లో బస చేసేవారు. కొన్నేళ్ళ తర్వాత వాళ్ళు ఖరీదైన రథంలో రామ్‌పూర్‌కి చేరుకున్నారు. అంతదాకా ఆ ఇద్దర్నీ పట్టించుకోని ఆ గ్రామ కరణం వారి దగ్గరకి వచ్చి చెప్పాడు.